# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ తీరప్రాంత అభివృద్ధిలో మత్స్యకారులను భాగస్వాములుగా చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు.
- ❖ పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి.
- ❖ నైరుతి రుతుపవనాలు రానున్న 3 - 4 రోజుల్లో బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

తీర ప్రాంతంలో జరిగే అభివృద్ధిలో మత్స్యకారులకు భాగస్వామ్యం ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామంలో ఆయన ఈరోజు "మత్స్య కారుల సేవలో" కార్యక్రమంలో పాల్గొని.. మత్స్యకార కుటుంబాలకు 261 కోట్ల 50 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సముద్ర తీర ప్రాంతంలో పోర్టులు వస్తే అభివృద్ధి జరుగుతుందని, అభివృద్ధిని మత్స్యకారులు అందిపుచ్చుకునేలా ప్రణాళికలు చేస్తామని చెప్పారు. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు అవుతోందని, దీని ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. 288 కోట్ల రూపాయల వ్యయంతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపట్టి, హార్బర్ కేంద్రంగా మత్స్య కారులను ఆర్థికంగా బలోపేతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

====================

మత్స్యకారుల వేట నిషేధిత భృతి కింద జిల్లాలో13,597 మందికి 27 కోట్ల రూపాయలు వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన `మత్స్యకారుల సేవలో` కార్యక్రమంలో పాల్గొనగా జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, సంయుక్త కలెక్టర్ జి. విద్యాధరి, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ యాదవ్ విశాఖ కలెక్టరేట్ నుంచి వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 15వ తేదీ నుండి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపలవేటపై నిషేధం ఉన్నందుకు మత్స్యాకారులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం కుటుంబానికి 20 వేల రూపాయల చొప్పున సహాయం అందిస్తోందని కలెక్టర్ తెలిపారు.

====================

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుపతి కలెక్టరేట్ లో ఈరోజు జరిగిన `మత్స్యకారుల సేవలో` కార్యక్రమంలో ఆయన పాల్గొని మత్స్యకారులతో సంభాషించారు. అర్హత ఉన్న ప్రతీ మత్స్యకారుడికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. మత్స్యకారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్న మంత్రి.. తిరుపతి జిల్లాకు 650 బోట్లు మంజూరు చేశామని.. మత్స్యకారుల పిల్లలకు స్కిల్ డెవలప్మెంట్ పై శిక్షణ ఇస్తున్నామని పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

====================

ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో ప్రధానంగా వీబీ-జి రామ్ జి పథకం, పల్లె పండుగ పనుల పురోగతిపై చర్చించారు. ఈ వేసవిలో పనులు వేగంగా జరపాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అయితే ఆయా పనుల పురోగతిని అధికారులు ఉప ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా తెలియజేశారు.

విరామం

====================

ఆకాశవాణి ద్వారా పరిచయమైన ఎందరో కళాకారులు ఖ్యాతిగడించి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని విశాఖపట్నం ఆకాశవాణి ప్రాంతీయ ఛానెల్ మేనేజర్ ఆర్. హర్షలత తెలిపారు. ఆకాశవాణి 90వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నం ఆకాశవాణి ప్రాంతీయ కేంద్రం ఈరోజు 3 కిలోమీటర్ల వాక్థాన్ నిర్వహించింది. ఈ వాక్థాన్ ను జిల్లా సంయుక్త కలెక్టర్ జి.విద్యాధరి ప్రాంతీయ ఛానెల్ మేనేజర్ ఆర్. హర్షలతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హర్షలత మాట్లాడుతూ... 63 సంవత్సరాలుగా ఆకాశవాణి విశాఖపట్టణం కేంద్రం ఉత్తరాంధ్ర ప్రజలకు అనేక కార్యక్రమాలను ప్రసారం చేస్తూ విజయవంతంగా కొనసాగుతోందని వెల్లడించారు. భవిష్యత్‌లో కూడా శ్రోతల కోసం జనరంజకమైన కార్యక్రమాలను నిరంతరాయంగా అందించేందుకు కృషి చేస్తామని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

ఈ వాక్థాన్ లో కార్యాలయ సిబ్బందితో పాటూ శ్రోతలు, విశ్రాంత ఉద్యోగులు, ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సిరిపురంలోని కార్యాలయ ప్రాంగణం నుండి ప్రారంభమైన ఈ వాక్ థాన్ ఆర్కే బీచ్ రోడ్ పొడవునా సాగింది.

====================

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని గిరిజన ఆరాధ్య దైవం శ్రీ మోదకొండమ్మ అమ్మవారిని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈరోజు దర్శించుకున్నారు. ఈ నెల 17వ తేదీన మొదలైన అమ్మవారి జాతర నేటితో

ముగియనుంది. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించామని తెలిపారు. గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి, మారుమూల గ్రామాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సంధ్యారాణి తెలియజేశారు.

====================

పార్వతీపురం మన్యం జిల్లాలో రాబోయే 5 రోజుల పాటు ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి సూచించారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం పలు మండలాలు ప్రమాద స్థాయికి వెళ్లే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు 41 సెల్సియస్ నుండి 54 సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. మధ్యాహ్నం సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు వెళ్లవద్దన్నారు. తరచూ మంచినీరు, ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని, వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు.

====================

తేనెటీగల పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుందని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ ధనుంజయరావు అన్నారు. జాతీయ తేనెటీగల పెంపకం, తేనె మిషన్ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయంలో “హనీ బీ క్వాలిటీ న్యూక్లియస్ స్టాక్ సెంటర్”ను ఈరోజు ఏర్పాటు చేశారు. రైతులకు రాయితీపై తేనెటీగల పెట్టెలు, పరికరాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా డాక్టర్ ధనుంజయరావు మాట్లాడుతూ... పంటల పరాగసంపర్కంలో తేనెటీగలు కీలక పాత్ర పోషించి దిగుబడులు, నాణ్యతను పెంచుతాయన్నారు. తేనె, మైనం, పుప్పొడి, ప్రోపోలిస్ వంటి ఉత్పత్తుల ద్వారా గ్రామీణ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు.

====================

నైరుతి రుతుపవనాలు రానున్న 3 - 4 రోజులలో ఆగ్నేయ అరేబియా సముద్రం, అండమాన్ సముద్రం, బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు మరింత విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ లక్షద్వీప్ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఆగ్నేయ అరేబియా సముద్రం నుండి, కేరళం, దక్షిణ అంతర కర్ణాటక, రాయలసీమ మీదుగా దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌పై ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతోందని వెల్లడించింది. వీటి ఫలితంగా ఉత్తర కోసాంధ్రలో కొన్ని చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు రేపు కురుసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

====================

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా `ప్రజా దర్బార్` నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన ఈరోజు ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి 40 అర్జీలు స్వీకరించారు.

====================
====================